క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ వీరప్రతాప్‌రెడ్డిలు తెలిపారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజుల్‌రెడ్డిలు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

12న మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈనెల 12వ తేదీ బుధవారం ఉదయం10.30 గంటలకు ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

11న సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పశుసంవర్ధకశాఖ డీడీ అచ్చెన్న హత్య కేసులో దోషులను శిక్షించాలని కోరుతూ ఈనెల 11న సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడించనున్నట్లు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్‌లు తెలిపారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. అచ్చెన్న హత్య కేసులో దోషులను వదిలేసి ఆందోళనకారులపై పోలీసులు ప్రతాపం చూపడం సరికాదన్నారు. ఈ కేసుపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు సత్తార్, గుర్రప్ప, సీఆర్‌వీ ప్రసాద్, దస్తగిరి, కేసీ బాదుల్లా, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో సినీ నటుని ప్రార్థనలు



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న నటుడు కబీర్ దుహన్‌సింగ్

కడప కల్చరల్ : సుప్రసిద్ధ సూఫీ పుణ్యక్షేత్రమైన కడప పెద్ద దర్గాలో బాలీవుడ్ నటుడు కబీర్ దుహన్‌సింగ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయనకు దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. తొలుత ప్రధాన గురువుల మజార్లను దర్శించుకున్న ఆయన అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకున్నారు. మంగంపేటలో షూటింగ్ కోసం వచ్చిన తనకు దర్గాను దర్శించుకునే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ జాతర



కడప కల్చరల్ : కడప నగరం అలంఖాన్‌పల్లెలో ఆదివారం మారెమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెల్లవారుజామున స్థానిక మహిళా భక్తులు బోనాలను సమర్పించారు. స్థానిక ప్రముఖులు ఆలయంలో తొలి పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలకు విశేష స్పందన లభించింది. కళాకారులు ప్రదర్శించిన చెక్కభజన, కోలాటాలు స్థానికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఘనంగా ఈస్టర్ వేడుకలు





కమలాపురంలో భక్తులకు సందేశం వినిపిస్తున్న సీఎస్‌ఐ చర్చి ఫాస్టర్, హాజరైన భక్తులు

పులివెందుల టౌన్ : యేసుక్రీస్తు పునరుత్తానం చెందిన రోజు ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి, బేతేలు చర్చి, ఆర్‌సీఎం చర్చి, హోసన్న తదితర ప్రార్థనామందిరాలలో ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తు వృత్తాంతాన్ని చదివి వినిపించి పాపులను రక్షించుటకై యేసుక్రీస్తు ప్రాణత్యాగంచేసి తిరిగి మూడురోజులకు పునరుత్తానం చెందాడని ఆయన గొప్ప మహిమగల దేవుడని వివరించారు.

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాలలో ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. ఆదివారం పట్టణంలోని సీఎస్‌ఐ, టీసీసీ టౌన్ చర్చి, టీసీసీ రామ్‌నగర్, ఆర్‌సీఎం, మన్నా, నిస్సీ, షిలోహు, యురూషలేము తదితర చర్చిలతో పాటు చదిపిరాళ్ల, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, గంగవరం, ఎర్రగుడిపాడు గ్రామాలలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా చేసుకున్నారు. స్థానిక సీఎస్‌ఐ చర్చి ఫాస్టర్ రెవ.భరత్ హెరాల్డ్ మాట్లాడుతూ యేసు క్రీస్తు అందించిన ప్రేమ, త్యాగాన్ని వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో క్రైస్తవ సోదరులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి పాస్కా దీపంతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటలకు ఏసు పునరుత్తాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వీధుల్లో తిరిగారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. మండలంలోని పైడికాలువ, వల్లూరు, పాపాగ్నినగర్, గణేష్‌పురం, బాలుగారిపల్లె, లేబాక, కుమారునిపల్లె, తోల్లగంగనపల్లె తదితర గ్రామాలలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ఆటలపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు.



వల్లూరులో దీపాలతో ఏసు రాకను స్వాగతిస్తున్న భక్తులు

జమ్మలమడుగు : స్థానిక ఎస్‌బీజీ క్వార్టర్స్‌లోని చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ స్టీఫెన్‌పాల్ మాట్లాడుతూ యేసుపై విశ్వాసులు ఆయన చూపిన దారిలో నడవాలన్నారు.



జమ్మలమడుగులో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

అధునాతన పద్ధతులతో వరిసాగు దిగుబడి

వైవీయూ : వరిసాగులో అధునాతన పద్ధతులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఒరిస్సాలోని పర్లాఖిముండిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధక విద్యార్థి వై. జశ్వంత్ గంగాధర్ పేర్కొన్నారు. రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కడప నగరం మామిళ్లపల్లిలోని పలువురు రైతులను ఆయన కలిశారు. కీలకాలను ఏ విధంగా నివారించాలన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

నగరంలో అట్టహాసంగా శోభాయాత్ర

కడప కల్చరల్: హిందూ చైతన్యవేదిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కడప నగరంలో శోభా యాత్ర–బైక్ ర్యాలీ అట్టహాసంగా నిర్వహించారు. నగరానికి చెందిన పలు హిందూ సంస్థల ప్రతినిధులు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు హర్షణీయం



ప్రజలకు మజ్జిగను పంపిణీ చేస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మెయిన్‌బజార్ వినాయకుని ఆలయ సమీపంలో విజయ పాలడైరీ వద్ద యజమాని బండి రామకృష్ణారెడ్డి తన అన్నాచెల్లెలు రామిరెడ్డి జనార్దన్‌రెడ్డి, బండి నాగరత్నమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. అలాగే శ్రీరామా హాలురోడ్డులోని సాయిశ్రీ ఫిజియోథెరఫి క్లినిక్ సమీపంలో కొంగనపల్లె శ్రీనివాసులు తన తల్లిదండ్రులు వెంకటనారాయణ, లక్ష్మినారాయణమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె : వేసవిలో చలివేంద్రాలు ఏర్పటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కో ఆప్షన్ సభ్యుడు అస్వానయ్యా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఎంపీటీసీలు చంద్రశేఖర్, భారతి, బాబా, షరీఫ్, వార్డు సభ్యుడు సునిల్ బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడులో వెలసిన అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, అగ్రికల్చర్, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్లు తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, స్థానిక నాయకులు ఉత్తమారెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రసవత్తరంగా బండ లాగుడు పోటీలు

వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని భారతి సిమెంట్స్ సౌజన్యంతో గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, ఉప మండలాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బండలాడుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, భారతి పరిశ్రమ సీఎంఓ సాయిరమేష్‌లు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఏడు కాండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన తవ్వా చంద్రవిజయ్‌రెడ్డి ఎద్దు అత్యధికంగా 3714 అడుగులతో ప్రథమ స్థానంలో నిలిచాయి. చిన్ననాగిరెడ్డిపల్లెకు చెందిన ఎన్‌టీఆర్ బుల్స్, వెంకటయ్య బెడుదురు కంబైన్ ఎద్దు 3668 అడుగులతో ద్వితీయ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లె భాస్కర్‌రెడ్డి ఎద్దు 3134 అడుగులతో తృతీయ స్థానంలో, తలపనూరు శివమారుతిరెడ్డి, ఎర్రగుంట్ల రామ ఓబుల్‌రెడ్డి కంబైన్డ్ ఎద్దు 3560 అడుగులతో నాల్గవ స్థానంలో, ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన బ్రాహ్మణ శ్రీ,భావన శ్రీ ఎద్దు 2880 అడుగులతో ఐదవ స్థానంలో నిలిచాయి. పోటా పోటీగా సాగిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.12వేలు, రూ.8 వేలు, రూ.4వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీసీపీఎల్ ప్రతినిధులు భా ర్గవ్‌రెడ్డి, కేఆర్ వెంకటేష్, రాయలసీమ సేల్స్ ఆఫీసర్లు కిరణ్ కుమార్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వైభవంగా పెద్దమ్మతల్లి జాతర

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని మోరగుడి, అంబవరం గ్రామాల్లో భక్తులు పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మండలంలోని తొర్రివేముల గ్రామంలో పెద్దమ్మతల్లి దేవరను ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతరలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డిలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



అంబవరంలో పెద్దమ్మతల్లికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

శేష వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు శేష వాహనంపై ఊరేగారు. ఉదయం సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో, ఆభరణలతో అలంకరించి పుర వీధుల్లో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన ఆచరించారు.

‘జగనన్నే మా భవిష్యత్’కు విశేష స్పందన



వేంపల్లెలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తొండూరు : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి



మైలవరం : ప్రభుత్వ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : పట్టణంలోని 6వ వార్డు పాతపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ఆదివారం ఆ ప్రాంత గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు కలిసి ప్రతి గడప వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. జగనన్న ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. తమ ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగిందని.. చెబుతూ ఈసారి కూడా జగనన్నే రావాలంటూ అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, వార్డు సభ్యుడు బికారి, సచివాలయ కన్వీనర్ నజీమ్‌బాషా, ఆదినారాయణ, గృహ సారథులు నాగేంద్ర, సుబ్బరాయుడు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : మండలంలోని గ్రామాలలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని రాష్ట్ర శాప్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి ప్రారంభించారు. తొండూరు, మల్లెల, కోరవానిపల్లె, బూచుపల్లె, బోడివారిపల్లె, భద్రంపల్లె, అగుడూరు, సంతకోవ్వూరు తదితర గ్రామాలలో వలంటీర్లు, గృహసారథులు కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల గృహ సారధుల కన్వీనర్ రజనీకాంత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముకుందారెడ్డి, శివశంకర్‌రెడ్డి, బంగారు మునయ్య, గురుమోహన్‌రెడ్డి, చలమారెడ్డి, బాలనరసింహారెడ్డి, వెంకటరమణ, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పెద్దముడియం సర్పంచ్ హసీనా ప్రజలను కోరారు. పెద్దముడియం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మండలంలోని దొడియం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గ్రామ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి ఆయన ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ రివర్స్ పోటీలు

రాజుపాళెం : ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మండలంలోని టంగుటూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన యువకుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 22 మంది పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మానవతామూర్తి హకీం మంజుమియా

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన మొన్నటి తరం ప్రముఖుడు, గొప్పవైద్యుడు హకీం మంజుమియా మానవతా మూర్తిగా కీర్తి గడించారని యోగి వేమన విశ్వవిద్యాలయం చిత్రలేఖన విభాగం అధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు అన్నారు. హకీం మంజుమియా వర్ధంతి సందర్భంగా ఆదివారం రాయలసీమ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మృత్యుంజయరావు మాట్లాడుతూ హకీంగా ఆయన జిల్లా వాసులకు అప్పట్లో అనితర సాధ్యమైన సేవలను అందించారని, అలాంటి వ్యక్తి మన జిల్లా వాసి అని చెప్పుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పర్యాటక ఫొటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావు, రేడియో వ్యాఖ్యాత గంగాధర్, డేవిడ్, విజయ్, సతీష్ పాల్గొన్నారు.

పత్రికా రంగానికి గౌరవం కల్పించిన ‘ఏఎస్ రామన్’

కడప కల్చరల్ : ప్రముఖ సంపాదక శిల్పి ఏఎస్ రామన్ భారతీయ పత్రికా రంగానికి ఎనలేని గౌరవ ప్రతిష్ఠలు కల్పించారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఏఎస్ రామన్ 105వ జయంతి సందర్భంగా ఏఎస్ రామన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఏఎస్ రామన్ మన జిల్లాలోని ప్రొద్దుటూరుకు చెందిన వారని, ఆయన తండ్రి ఏకే ముని సాహితీ వేత్తగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధునిగా సేవలు అందించారన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , గ్రంథ పాలకులు ఎస్.రమేష్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆల్ కడప చెస్ అసోసియేషన్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఏపీ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు, వీరేంద్రరావు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. కడప జిల్లా ఓపన్ విభాగంలో రూపేష్‌రెడ్డి (ప్రథమస్థానం), కటారి సజోత్ను (ద్వితీయ), మురళీకృష్ణారెడ్డి (తృతయ)స్థానాల్లో నిలిచారు. అన్నమయ్య జిల్లా ఓపన్ విభాగంలో ఎం. రుత్విక్ రామ్ ప్రథమస్థానం సాధించాడు. వీరికి నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.



చదరంగం విజేతలతో నిర్వాహకులు

జాతీయ స్థాయిలో రాణించాలి

కడప స్పోర్ట్స్: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లాకు చెందిన కరీముల్లా జాతీయస్థాయి వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు కెప్టెన్‌గా పనిచేశారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని వాలీబాల్ క్రీడలో రాణించాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్లో రాణించేవారికి చక్కటి ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం టోర్నమెంట్ విజేతలకు, జాతీయస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులకు జ్ఞాపికలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, శాప్ బోర్డు డైరెక్టర్ డానియల్ ప్రదీప్‌కుమార్, క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ పాల్గొన్నారు.

ఉచితంగా నేత్రపరీక్షలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హైదరాబాద్ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేకాధికారి సి.సాయిగ్రేస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటిరక్షణలో జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం వైద్యులు విద్యార్థులకు నేత్రపరీక్షలు నిర్వహించా రు. డాక్టర్ లక్ష్మి, తేజ, ప్రభాకర్, సూపరింటెండెంట్ వీరయ్య, ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్ పాల్గొన్నారు.

15న నాటక ప్రదర్శన

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 15వ తేదీన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా లలితకళల విభాగం ఆధ్వర్యంలో ఏకపాత్రాభినయాలు, సైసైరా నరసింహారెడ్డి నాటకాలను ప్రదర్శించనున్నట్లు లలితకళల సమన్వయకర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలిపారు. వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్‌లో 15వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్ట్స్‌బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

రేషన్ షాప్ సీజ్

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేటకు చెందిన మాబుచాన్ (బీబీ) రేషన్ షాపు (85)ను అధికారులు ఆదివారం సాయంత్రం సీజ్ చేశారు. కార్డుదారుల ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎల్.వరదకిశోర్‌రెడ్డి తన సిబ్బందితో ఆదివారం ఎండీయూ వాహనాన్ని, రేషన్ షాప్‌కు వెళ్లి నిల్వలను పరిశీలించారు. ముందుగా డీలర్‌కు అధికారులు ఫోన్ చేసినా ఆమె వారి మాటను ఖాతరు చేయకుండా షాపు వద్దకు రాలేదు. రేషన్ షాపు ఇంటి యజమాని శేషగిరినాథ్ సమక్షంలో బీగం పగులగొట్టి పరిశీలించారు. పంపిణీ కన్నా 8 క్వింటాళ్ల బియ్యం అదనంగా రేషన్ షాపులో నిల్వ ఉండటంతో అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు.